రైతులకు వెంటనే రైతుభరోసా ఇవ్వాలి

మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ మండలాధ్యక్షుడు దండు యాదవరెడ్డి

షాబాద్, జనవరి 6: ప్రభుత్వం రైతులకు వెంటనే రైతుభరోసా ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ మండలాధ్యక్షుడు దండు యాదవరెడ్డి అన్నారు. సోమవారం షాబాద్ లోని రైతువేదికలో భారతీయ కిసాన్ సంఘ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.12వేలు ఇస్తామని ఒక మాట, రూ.15వేలు అని మరో మాట, రైతులను దరఖాస్తు చేసుకోవాలని ఒకమాట, దరఖాస్తు అవసరం లేదని మరొకటి చెబుతూ, రోజుకో మాట చెప్పి రైతులను తికమక పెడుతున్నదన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా త్వరగా రైతుభరోసా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గసభ్యుడు సత్యనారాయణరెడ్డి, సభ్యులు రామస్వామి, చంద్రబాబు, సత్యం గౌడ్, పాండుగుప్తా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చలో కలెక్టరేట్‌కు వెళ్తున్న మున్సిపల్ కార్మికులు

ఆమనగల్లు, జనవరి 6 : మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం సోమవారం మున్సిపల్ కార్మికులు చలో కలెక్టరేట్ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే తదితర పద్ధతుల్లో పని చేస్తున్న మున్సిపల్ సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు వగ్గ రవి, హంసమ్మ, యాదమ్మ, నర్సింహ్మ, జంతుక చిన్న, విజయ, చిట్టిబాబు, పట్టాభి, కార్మికులు ఉన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం రవికుమార్

షాద్‌నగర్‌రూరల్, జనవరి 6 : షాద్‌నగర్‌లో యాదవ్ బుడోఖాన్ కరాటే క్లబ్ అధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సాయిచరణ్, సాయి వర్ధన్, గణేశ్ ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు హెచ్ఎం రవికుమార్ తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో సినీ హీరో సుమన్ అదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రశంసా పత్రాలు అందజేశారని తెలిపారు. కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ప్రణాళిక సిద్ధం చేయాలి

- మండల ప్రత్యేక అధికారి సుజాత, ఎంపీడీవో బాలశంకర్
- బీపీడీపీ యాక్షన్ ప్లాన్ నివేదికపై అధికారులతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సుజాత

మంచాల, జనవరి 6 : గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పూర్తిస్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని మండల ప్రత్యేక అధికారి సుజాత, ఎంపీడీవో బాలశంకర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం 2025-26 ఏడాదికి బీపీడీపీ యాక్షన్ ప్లాన్ నివేదికపై మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులతో వారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా వాటి పరిష్కారానికి నిధులు ఎంత ఖర్చు అవుతాయనే వాటిపై నివేదికను తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్ రావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తృతపరుస్తాం

అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దామోదర్‌రెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు

కడ్తాల్, జనవరి 6 : రాబోయే రోజుల్లో లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృత పరుస్తామని క్లబ్ ఐ దవాఖాన చైర్మన్ దామోదర్ రెడ్డి అన్నారు. సోమవారం లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి మామ జంబుల రంగారెడ్డి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీల్స్ అండ్ వీల్స్ కార్యక్రమాన్ని క్లబ్ సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆకలితో అలమటించే వారికి అన్నదానం చేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం 460 మందికి అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మహేశ్, సభ్యులు వెంకటేశ్, అంజయ్య, గోవర్ధన్‌రెడ్డి, రాజేందర్‌యాదవ్, బీచ్యానాయక్, లక్ష్మయ్య, పీఆర్‌వో పాషా తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

చేవెళ్లటౌన్, జనవరి 6 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహిపాల్ కోరారు. ఈ మేరకు సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యులు నితీశ్, కిశోర్, అనిల్, ప్రణయ్, వైశాలి, సింధు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ వద్దు.. పంచాయతీలే ఉండాలి

మొయినాబాద్, జనవరి 6 : ప్రభుత్వం మొయినాబాద్ మండల పరిధిలోని కొన్ని గ్రామాలను కలుపుతూ మున్సిపాలిటీ చేయాలన్న ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామని గ్రామ పంచాయతీలుగానే ఉండాలని సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డికి విలీన గ్రామాల ప్రజలు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎన్కేపల్లి, చిలుకూరు, మొయినాబాద్, పెద్దమంగళారం, సురంగల్ గ్రామాలను కలుపుతూ మొయినాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించి అసెంబ్లీలో ప్రకటించిందని తెలిపారు. మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తే కలిగే ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, జగన్మోహన్‌రెడ్డి, మాణిక్యం,ప్రవీణ్, జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేయాలి

ఆమనగల్లు : గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులను నిలిపివేయాలని మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండతండాకు చెందిన రైతులు సోమవారం డీఆర్‌వో సంగీత, కందుకూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ లలితకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంతో తమకున్న కొద్ది పాటి భూములు కోల్పోవాల్సి వస్తుందని, అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ పనులను ఆపివేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మణిపాల్, బోడ్యి, చందర్, పాండు, రవిరాథోడ్, విజేందర్, రాజా, వినోద్, గోపి, శివరాం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

శిబిరంలో మందులు అందజేస్తున్న వెంకటేశ్‌గుప్తా, దశరథ్‌నాయక్, వైద్యులు

కడ్తాల్, జనవరి 6 : గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మక్తమాదారంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్-రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్-గంప లక్ష్మయ్య గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, కామినేని దవాఖాన సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక నాయకులతో కలిసి వారు ప్రారంభించారు. వైద్య శిబిరంలో 425 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యులు అఖిల్, అనిల్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచన, మాజీ ఎంపీటీసీ మంజుల, మాజీ ఉప సర్పంచ్ గణేశ్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సాయిలు, చంద్రమౌళి, నాయకులు కృష్ణయ్య, జలీల్, మహేందర్‌గౌడ్, కిషన్, జంగయ్య, చెన్నయ్య, చందు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

షాబాద్ : క్యాలెండర్, డైరీ, ఐడీకార్డులు ఆవిష్కరిస్తున్న ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ తదితరులు

షాబాద్, జనవరి 6: మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం వద్ద పీఆర్‌టీయూటీఎస్-2025 క్యాలెండర్‌తో పాటు డైరీ, ఉపాధ్యాయుల ఐడీ కార్డులను సోమవారం మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్‌నాయక్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు ఐడీకార్డులు అందించడానికి మర్పల్లి అశోక్ మెరియా ముందుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి, షాబాద్ మండల అధ్యక్ష, కార్యదర్శులు దేవిడ్‌రెడ్డి, కృష్ణ, గౌరవ అధ్యక్షుడు అంజయ్య, రాష్ట్ర బాధ్యులు, మండల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాటసింగారంలో..

అబ్దుల్లాపూర్‌మెట్ : మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం ప్రధాన కార్యాలయంలో పాలకవర్గ సభ్యులతో కలిసి చైర్మన్ భరత్‌కుమార్ యాదవ్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మల్లమ్మ, డైరక్టర్లు జైపాల్‌రెడ్డి, బాలనర్సమ్మ, యాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, నాయకులు జంగమయ్య యాదవ్, మేనేజర్ ఐలేశ్ యాదవ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ భరత్‌కుమార్ యాదవ్

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్, జనవరి 6 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు విద్యా బోధన చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని శంకర్‌పల్లి బాలికల గురుకుల పాఠశాల, పెద్దమంగళారం గురుకుల కోడింగ్ పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మొయినాబాద్‌లోని పెద్దమంగళారం గ్రామ రెవెన్యూలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కోడింగ్ పాఠశాలలో హిందీ, సోషల్ సబ్జెక్ట్‌లో ఇంగ్లిష్ మీడియంలో బోధన చేసేందుకు డెమో ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఉన్న శంకర్‌పల్లి గురుకుల బాలికల జూనియర్ కళాశాల/పాఠశాలలో జువాలజీ సబ్జెక్టు ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన చేయడానికి అధ్యాపకులు కావాలని తెలిపారు. ఈ నెల 9న తమ విద్యార్హత సర్టిఫికెట్లు జిరాక్స్ తీసుకుని పెద్దమంగళారంలో ఉన్న గురుకుల కోడింగ్ పాఠశాలకు రావాలని సూచించారు. మర్ని వివరాలకు సెల్ 9652781171 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌టౌన్, జనవరి 6: షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం ఉషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి నెలా ఈ కార్యక్రమాన్ని ర్వహిస్తున్నామన్నారు. ప్రయాణికులకు ఆర్టీసీ ద్వారా ఎలాంటి సమస్యలు ఉన్నా డయల్ యువర్ డీఎం సెల్ నంబర్ 9959226287 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ ప్రయాణికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యాచారం, జనవరి 6 : చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంథన్‌గౌరెల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని భానుతండా11 కేవీ ఫీడర్‌కు మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆ శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని భానుతండా, కేసీతండా, నూన్సావత్‌తండా, మీసాలతండా గ్రామాలతోపాటు వ్యవసాయ పొలాలు, కోళ్ల ఫారాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు, వ్యాపారులు సహకరించాలని వారు కోరారు.

మున్సిపల్ పరిధిలో అభివృద్ధికి సహకరిస్తా..

సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర రోడ్లు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

తుర్కయాంజాల్, జనవరి 6 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీ అభివృద్ధికి సహకరిస్తానని రాష్ట్ర రోడ్లు అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. సోమవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ మాట్లాడుతూ మున్సిపాలిటీలో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడానికి కౌన్సిల్ తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ హరిత, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ అయిలయ్య, కల్యాణ్ నాయక్, కౌన్సిలర్లు కొత్తకుర్మ మంగమ్మ, కొండ్రు మల్లేశ్, సంగీత, మర్రి మాధవి, శ్రీలత, ధన్‌రాజ్, కమిషనర్ అమరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు, జనవరి 6 : మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మిస్తామని చైర్‌పర్సన్ బాతుక లావణ్యాదేవేందర్ అన్నారు. 11వ వార్డులో రూ.5లక్షల నిధులతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు ప్రసన్నలత, శ్రీనివాసులు, బీఆర్ఎస్ నాయకులు దేవేందర్‌యాదవ్, శ్రీనివాసులు, ఆల్విన్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, పీర్ల గూడెం చంద్రయ్య, కుమ్మరి లక్ష్మయ్య, రాజిరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

తిప్పాయిగూడకు బస్సు సౌకర్యం కల్పించాలి

ఇబ్రహీంపట్నం డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

మంచాల, జనవరి 6 : ఆరుట్ల నుంచి చౌటుప్పల్‌కు వెళ్లే బస్సు సర్వీసును తిప్పాయిగూడ మీదుగా నడిపించాలంటూ సోమవారం గ్రామానికి చెందిన సీపీఎం నాయకులు, జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్యతో కలిసి ఇబ్రహీంపట్నం డిపో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిప్పాయిగూడకు గతంలో వచ్చిన ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను యాథావిధిగా నడిపించాలని అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జంగయ్య, యాదయ్య, సుధాకర్, ఐలయ్య, సత్తయ్య, జగన్, కవిత, మాదవి, బాలకృష్ణ, వెంకటయ్య, బుగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ డీజీని కలిసిన మాజీ సర్పంచ్‌లు

మంచాల, జనవరి 6 : మండల పరిధిలోని తిప్పాయిగూడ మాజీ సర్పంచ్ భర్త వీరేశం గౌడ్, రాచకొండ మాజీ సర్పంచ్ సాగర్ సోమవారం అడిషనల్ డీజీ మహేశ్ భగవత్‌ను నగరంలోని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

డ్రైవర్ నిర్లక్ష్యంతో కూలీ మృతి

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 6 : డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ కూలీ మృతి చెందిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలోని జరిగింది. ఇబ్రహీంపట్నం పోలీసులు, బిహార్ కూలీలు తెలిపిన వివరాలు.. బిహార్ రాష్ట్రంలోని బైసాలి జిల్లాకు చెందిన ఆకాశ్ కుమార్ (20) రెండు నెలల క్రితం శ్రీమణి కంట రైస్ మిల్లులో రోజువారీ కూలీగా చేరాడు. సోమవారం కోళ్ల దాణాతో ఉన్న డీసీఎంలోకి ఆకాశ్ ఎక్కుతుండగా డ్రైవర్ సడెన్‌గా ముందుకు తీయడంతో అదుపు తప్పి టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు, కుటుంబీకులు, స్నేహితులు అక్కడికి చేరుకొని ఆందోళనకు దిగారు. ఈ మేరకు రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆదిబట్ల, జనవరి 6 : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తి తో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్న ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మైన్మార్ దేశానికి చెందిన నూర్ ఆలం ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ తన భార్య పిల్లలతో కలిసి బాలాపూర్ పక్కన ఉన్న డైమాండ్ ఓటల్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. ఓ ఆటోను కిరాయికి తీసుకుని ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని కేజీకి రూ.10లకు కొనుగోలు చేసి మరో వ్యక్తి జహంగీర్‌కు రూ.15 అమ్మకానికి పెట్టాడు. సోమవారం ఓ ఆటోలో 700 కేజీల రేషన్ బియ్యాన్ని తరలించి బండ్లగూడ, చాంద్రాయణగుట్ట, ప్రాంతాల్లోని రైస్ మిల్లులు, ఫ్రౌల్ట్రీ ఫారాలకు విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువత దేశ రక్షణలో ముందుండాలి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 6 : యువత దేశ రక్షణలో ముందుండాలని ఎల్బీనగర్ డీసీపీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇటీవల విడుదలైన ఎస్ఎస్‌సీ జీడీ కానిస్టేబుల్ ఉద్యోగాల్లో సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 10 మందిలో 8 మంది పీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ విభాగాల్లో ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం వారిని డీసీపీ సన్మానించి సురక్ష సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కిక్కెర గోపిశంకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

సురక్ష సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కిక్కెర గోపిశంకర్‌ను అభినందిస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్

ఆర్టీసీ డ్రైవర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ అనూష తదితరులు

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 6 : ఆర్టీసీ డ్రైవర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆర్టీఏ కార్యాలయం ఎంవీఐ అనూష హెచ్చరించారు. సోమవారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ డ్రైవర్లు డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడటం చట్టరీత్యా నేరమన్నారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటనర్సప్ప, అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్, సూపర్‌వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

విత్యాలలో వాటర్ ప్లాంటు ఏర్పాటు

షాద్‌నగర్‌రూరల్, జనవరి 6 : ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విత్యాల గ్రామంలో రాయికల్ టోల్‌ప్లాజా ప్రాజెక్ట్ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన 20వేల లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్ ప్లాంటును సోమవారం టోల్‌ప్లాజా మేనేజర్ ఇబ్రహీం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినందుకు టోల్‌ప్లాజా నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో గ్రామంలో పలు అభివృద్ధి పనులను చేపట్టిన టోల్ ప్లాజా మేనేజర్ నేడు వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గ్రామస్తులు ఈ వాటర్ ప్లాంటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మైను, వెంకటయ్య, రాజు, రమేశ్, శ్రీశైలం, విజేందర్, శ్రీను, నర్సింహులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న టోల్‌ప్లాజా మేనేజర్ ఇబ్రహీం

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదు

రాజును సన్మానిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో, సిబ్బంది

చేవెళ్లటౌన్, జనవరి 6 : ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పదని చేవెళ్ల ఎంపీడీవో హిమభిందు, ఎంపీవో విఠలేశ్వర్ తెలిపారు. చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా పని చేసిన ఎం.రాజు ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజుతో పాటు భార్యను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. రాజు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవీందర్, సీనియర్ అసిస్టెంట్ రమేశ్, టైపిస్టు రాంచంద్రయ్య, సబార్డినేటర్ మహ్మద్ గౌస్, శోభ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.